# భాష - సమయం

'భాష – పరామర్శ', 'భాష-దోషాలు' వంటివి చదివుంటారు. ఇప్పుడు ఈ భాష – సమయం ఒక రకంగా ఒకటి కాదు. ఇంకో రకంగా ఒకటే.

సమయం అంటే కాలం. సమయం అంటే వ్యవధి కూడా.

'వీడికి సమయం, సందర్భం లేదు' అని ఎవరైనా వేళకాని వేళ వచ్చినా, మాట్లాడినా అంటుంటాం.



టైమెంతయ్యింది అని అడగడానికి బదులు సమయం ఎంత అని అడిగేవారు కూడా కొందరున్నారు. వాడికి 'టైమ్ సెన్స్ లేదు అంటే, సమయం, సందర్భం లేవనే.

తెల్లదొరల పాలనలోనే పంక్చువాలిటీ అనే మాట మనకు తెలిసివుంటుంది. ఇంగ్లీషోడికి టైమంటే టైమే అనీ, మహా పంక్చువాలిటీ అనీ అప్పట్లో మనవాళ్ళు తెగపొగిడేవారని పుస్తకాల ద్వారానూ, కొందరు పెద్దవాళ్ల ద్వారానూ తెలుసుకున్నాం.

పంక్చువాలిటీని సమయం పాటించడం అనుకోవచ్చు. ఆఫీసుకి పదిగంటలకయితే పదిగంటలకూ రెండు గంటలకయితే రెండు గంటలకూ కరెక్టుగా వెళ్ళేవాళ్ళను పంక్చువాలిటీ పాటించేవాళ్ళు అనుకోవచ్చు. అలాగే ఇన్ని గంటలకు వస్తానని చెప్పి, ఆ టైమ్‌కెళ్తే కూడా పంక్చువాలిటీ పాటించేవారిగా చెప్పుకోవచ్చు.

ఈ సమయం పాటింపు లేదా పంక్చువాలిటీ వల్ల ఎప్పుడూ ప్రయోజనమే ఉంటుంది. పాటించే వ్యక్తికీ ఎదురుచూసే వ్యక్తికీ సమయం వృధాకాదు.

ఇక ఉద్యోగ, వ్యాపార వ్యవహారాల్లో అయితే సమయం పాటింపు ఎంతో అవసరం. దీనివల్ల కాలం కలిసి రావడమే కాకుండా, ప్రజలకు సంబంధించిన వ్యవహారాలు చూసే ఆఫీసయితే, వారికి ఎంతో మేలు కలుగుతుంది.

పత్రికల వాళ్లకయితే సమయం పాటింపు చాలా చాలా అవసరం. ఇన్ని గంటలకు పేజీల మేకప్ పూర్తికావాలి, ఇన్ని గంటలకు ప్లేట్ మేకింగ్ కావాలి, ఇన్ని గంటలకు ప్రింటింగ్ పూర్తి కావాలి, ఇన్ని గంటలకి ఫలానా ఊరు చేరాలి అనుకున్నప్పుడు ఆ సమయం పాటించినప్పుడే పాఠకుడికి ఆ పత్రిక పొద్దుటే చేరుతుంది. మధ్యలో ఏ విభాగంలో ఏ అవాంతరమొచ్చినా, పాఠకుడికి సమయం, మించిపోతుంది.

కొందరు ఆఫీసుకి సమయానికి వెళ్ళినా, ఇతర విషయాల్లో చెప్పిన సమయానికి వెళ్ళరు. ఈ అలవాటు రాజమండ్రిలో కొందరు మిత్రులతో నాకు అనుభవమే. ఎప్పుడైనా నేను అన్న సమయానికి కొంచెం లేటయితే, మా మిత్రుడొకడు 'మీరు రాజమండ్రి వారయిపోయారు' అని చురక నేస్తుంటాడు.

మరి భాష? ఇక్కడ నేను చెప్పే భాష మాతృభాష, పరాయి భాష గురించే. ఏవో కొన్ని నగరాలల్లో

తప్ప చదువుకున్న వాళ్ళు కూడా మాతృభాషలోనే మాట్లాడతారు. మనం తెలుగు ప్రాంతం వాళ్లమయితే, అక్కడి వాళ్లతో తెలుగులో మాట్లాడితేనే మంచిది. ఇంగ్లీషో, హిందీయో తెలిసినా ఆ భాష మాట్లాడడానికి చాలా మంది ఇష్టపడరు. అంతా తెలుగే మాట్లాడే రాజమండ్రిలో ఓ అడ్వర్ టైజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ తన ఇంగ్లీషు పరిజ్ఞానంతో అచ్చతెలుగు వ్యాపారి బుర్రతినేయడంతో, అంతకు ముందు వరకూ ఓ అడ్వర్‌టైజ్ మెంట్ ఇద్దామనుకున్న ఆ వ్యాపారి మనసు మార్చుకున్న సంగతి విన్నాను.

అందుకే సమయం, భాష సందర్భానుసారం ఉండాలి. ఇన్ని గంటలకు వస్తానంటే అన్ని గంటలకే వెళ్ళాలి. మాతృభాష తెలిసిన వారితో మాతృభాషలోనే మాట్లాడాలి. అలా చేయకపోతే రెండువైపుల వారికీ ఇబ్బందే.

రెండ్రోజుల క్రితం, అంటే ఏప్రిల్ 13న జలియన్ వాలాబాగ్ దుర్మార్గం జరిగి డెబ్బై అయిదేళ్ళయిన సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించడానికి సభ జరిగింది. ఆ సభకు వివిధ రాష్ట్ర ముఖ్యమంత్రులూ, కేంద్ర మంత్రులూ, ఇతర ప్రముఖులూ హాజరయ్యారు. ముందుగా అనుకున్న సమయానికి ప్రారంభమయివుంటే ఆ సభ మధ్యాహ్నం ఒంటిగంటకు పూర్తి కావాలి. అలాంటిదా సభ మూడున్నర గంటలకు ప్రారంభమయింది. అంతవరకూ వేచివున్న ప్రజలకూ సభా ప్రారంభానికి ముందే సగానికి పైగా పోయిన జనానికీ సహనం పూర్తిగా చచ్చింది. స్త్రీలూ, పిల్లలూ అయితే సరేసరి.

వేదిక మీదున్న ప్రముఖుల్లో ఎక్కువ మంది ఇంగ్లీషులోనో, హిందీలోనో ప్రసంగించారు. తరలి వచ్చిన జనంలో ఎక్కువ మందికి పంజాబీయే వచ్చు. త్రిపుర గవర్నర్ రమేష్ భండారీ, ఢిల్లీ ముఖ్యమంత్రి మదన్‌లాల్ ఖురానా మాత్రం పంజాబీలోనే మాట్లాడారు. మిగతావాళ్ల భాష అర్థంకాని, అప్పటికే సమయం పాటించని సభ పట్ల సహనం కోల్పోయిన జనం లేచిపోయారు. నిరసన వ్యక్తం చేశారు. దాంతో లాఠీచార్జీ జరిగింది. అలా పోలీసులూ డయ్యర్‌ను మించిన వాళ్ళయ్యారు.

అందుకే సమయం పాటించడం, ఎదుటివారి బుర్ర తినని భాషలోనే మాట్లాడడం అవసరం అని నాకు నేను మరోసారి చెప్పుకుంటూ ఇతరులకు మొదటిసారి చెబుతున్నా.

**18.4.94**

ఆంధ్రభూమి దినపత్రిక